కథ

నరేష్ చేతులు రెండూ వెనక్కి విరిచి, ఇంటి ముదు వున్న స్తంభానికి కట్టి పడేసారు. వాడు "వామ్మో...వాయ్యో... నాయనో" అంటూ పెద్దగా పెడబొబ్బలు పెడుతూ ఏడుస్తున్నాడు. నరేష్‌కి పదకొండేళ్ళు. ఐదోతరగతి చదువుతున్నాడు. వాడ్ని గుంజకి కట్టేసిన వాళ్ళ నాన్న ఈత మెల్లెలు రెండు తెచ్చి, వాడ్ని అప్పటికే నాలుగు బాదాడు. వాళ్ళమ్మ ఆండాళ్ళమ్మ గడపమీద కూర్చుని ఏడుస్తూ "ఇంక చాల్లే ఆపు" అని భర్తని విసుక్కుంటూ, బతిమాలుకుంటూ కోపంగా అరుస్తోంది. "నువ్వు నోర్మూయ్.. అసలు నీ వల్లే వాడు ఇంత పని చేసింది" అని సత్యం భార్యని కోప్పడ్డాడు. ఆమెని మాట్లాడనివ్వడంలేదు. నరేష్ ఇంట్లో వందరూపాయలు దొంగతనం చేసి, ఒక్క రోజులోనే మొత్తం ఖర్చుపెట్టేశాడు.

# పసి హృదయం

## మొలకలపల్లి కోటేశ్వరరావు

సత్యానికి ఆ విషయం తల తీసేసినట్లుగా వుంది. ఆయన క్రమశిక్షణ అంటే ప్రాణమిస్తాడు. పిల్లలు చిన్నతనంనించే క్రమశిక్షణతో, మంచి లక్షణాలతో, మంచి పేరు పొందుతూ, ఫలానా వాళ్ళ పిల్లలు అని అందరూ గొప్పగా చెప్పుకోవాలని సత్యం కోరిక.

ఇరుగు పొరుగు జనం చాలా మంది చేరారు. చేరిన వాళ్ళు తలోరకంగా మాట్లాడుతున్నారు.

వాళ్ళందర్నీ చూసిన సత్యానికి చాలా ఉత్సాహంగా వుంది. పూనకం వచ్చింది. తను క్రమశిక్షణ అంటే ఎంతగా పడిచస్తాడో వాళ్ళందరికీ తెలిపే అవకాశం దొరికిందని సంతోషపడిపోతున్నాడు.

"చిన్నప్పట్నించీ ఎంత బాగా పెంచాను. ఇప్పటి వరకూ ఎంత పద్ధతిగా వున్నావు. నీ అంతట నీకు పుట్టిన బుద్ధి కాదురా ఇది. నీ సావాసగాళ్ళు ఎవరో తీసుకురమ్మన్నారు, నువ్వు తీసావు. చెప్పు, నిన్ను దొంగతనం చేయమని చెప్పింది ఎవరూ? నిన్ను ఈ పనికి పురగొల్పింది ఎవరూ?" కాళ్ళకి పెట్టి ఒక దెబ్బవేసి, అడిగాడు సత్యం.

"నన్ను ఎవరూ తీసకరమ్మన్లేదు. నేను తీసుకున్నా" ఏడుస్తూ, వెక్కిళ్ళు పెడుతూ అన్నాడు నరేష్.

"అరె... మళ్ళీ అదే మాట! అసలు దొంగతనం చేయాల్సిన అవసరం నీకేం వచ్చింది? నీకేం కొరవ అయితే ఈ పని చేసావు? నీకేం తక్కువ చేసాను? నీకు ఇంట్లో తింటానికి ఎప్పుడూ ఏవో వుంటాయే! నీ కోసం చేయించి పెడుతున్నా కదా ఇంట్లో!" మళ్ళీ దెబ్బ వేశాడు.

వచ్చిన జనానికి సరదాగా వుంది. పనుల్లేని రోజులు. మంచి కాలక్షేపం.

"ఇంక చాల్లే వూరుకోవయ్యా! చస్తాడు. ఇంక ఎప్పుడూ తీయడ్లే!" వాకిట్లో కూర్చున్న భార్య అంది.

"తీయడ్లే అని నువ్వు చెబితే ఎట్టే? ఇప్పుడెందుకు తీసాడు? ఇప్పుడు తీసిన వాడు రేపు తీయడని గేరంట్ ఏంది?" లాపాయంట్ లాగి, మరో రెండు పీకాడు.

"అయితే ఎంత సేపు కొడతావు అట్ట! బిడ్డ చచ్చేదీ, బతికేదీ తెలియకుండా తంతే ఏమని? ఇంక తీయనని చెపతన్నాడుగా?"

"అసలు నువ్వు అరవ్వాకవే! నీ అలుసు చూసుకునే వాడు ఇట్ట పాడైపోయాడు. ఇంక నాలుగుతన్నమని చెప్పాల్సిందిపోయి వాడ్ని వెనుకేసుకొస్తావేం? ముందు నిన్ను పట్టుకుని ఉతకాలి?" భార్య మీద కోప్పడ్డాడు.

"ఇంక అందర్నీ తన్నడం, ఉతకడమే పని! తెలిసీ తెలియనోడు ఏదో తెలియక తప్పు చేసాడు. కళ్ళతో దండించి వదిలిపెట్టాల్సింది పోయి, ఎంతసేపని కొడతా?"

"అసలు దొంగతనం ఎంత నామర్దా ఎవారమే! అటు ఏడు తరాలూ, ఇటు ఏడు తరాలూ చూసుకున్నా మా ఇంటావంటా ఇలాంటి బుద్ధుల్లేవు! ఈ కాలానికి ఈడు దాపురించాడు. అసలు మా వంశమంటే ఎంత పేరూ, ఎంత గొప్పా!"

"చాల్లే సంబడం! చెప్పక చెప్పక మీ వంశాన్ని గురించి చెప్పు. అక్కడ ఎచ్చులు తప్ప ఏంలేదు"

"ఏమే, మా వంశానికేమే! మా వంశాన్ని

వేలెత్తి చూపేదానివయ్యావు నువ్వు! మీలాగా ఉడతలు పట్టే వంశం కాదు మాది!''

''మా వంశాన్ని అంటే నేనూరుకోను. మాది కాదు ఉడతలు పట్టే వంశం. మీదే ఉడతలూ, తొండలూ, దొంగకోళ్ళూ పట్టే వంశం''

''ఎంత మాట అన్నావే! ఎంతో గొప్ప వంశాన్ని పట్టుకుని నోటికి ఏమాట వస్తే ఆమాట కూస్తే కళ్ళుపోతాయే! మా వంశం అంటే ఎటు చూసినా ఆమడదూరం పేరు''

''ఒక ఆమడేం కర్మ, పదకొండు ఆమడల దూరం పేరు తమరి వంశం అంటే, ఇంత పనికి మాలిన బాపతు దేశంలో ఎక్కడా వుండదని! మీ వంశం గొప్పలు నాకు చెప్పకు. తల్లి పుట్టిల్లు మేనమామకు తెలియదా?'' పదిహేనేళ్ళ బట్టీ కాపరం వెలగబెడతన్నా మీతో! మీ వంశం గురించి నాకు ఎందుకు చెపుతావ్, తెలియకపోతే కదూ!''

''ఓరేయ్... మీలో మీరు పోట్లాడుకోవడమేనా! విషయం తెల్చేపని వుందా, లేదా?'' అంటూ సుబ్బన్న రంగ ప్రవేశం చేసాడు.

''అది కాదు మామా... ఇది మా వంశాన్ని గురించీ...''

''మీ గోల ఆపండ్రా. రామాయణంలో పిడకల వేట మాదిరిగా మజ్జిలో మీ గొడవ ఎందుకు? ముందు పిల్లవాడి విషయం తేల్చండి''

''ఏం చేయమంటావో చెప్పు మామా... ఇంత చిన్న వయసులోనే వంద రూపాయలు దొంగతనం చేసాడు''

''వేలెడంత లేడు. అప్పుడే దొంగతనానికి పాల్పడితే ఏమని? ఇప్పుడే తగిన శిక్షవేయాల్రా! ఏదైనా మొక్కప్పుడే వంచాలి. మొక్కప్పుడే వంచకపోతే రేపు మానైన తరువాత అసలు అలివి అవుతాడూ?''

సుబ్బన్న తనని తను పెద్ద మనిషిగా చెప్పుకుంటాడు. ఊళ్ళో ఎక్కడ ఏ చిన్న గొడవ జరిగినా అక్కడ ప్రత్యక్షమవుతాడు. ఇద్దరి మధ్యా తల దూరుస్తాడు. రాజీచేయాలనో, తీర్పు చెప్పాలనో, మధ్య వర్తిత్వం వహించాలనో ఏదో విధంగా జోక్యం చేసుకుంటాడు. పెద్ద మనిషి తనం చేయాలని మహా ఉబలాటం! అయితే ఆయన మాటని ఎవరూ పట్టించుకోరు. తను ఎంత పెద్దమనిషిని అనుకుంటాడో, జనం అందుకు వ్యతిరేకంగా ఆయనకి పూచికపుల్ల విలువ ఇవ్వరు. ఆయనని విసుక్కుంటారు. విదిలించికొడతారు.

''పెద్ద మనుషులకి ఇవన్నీ తప్పవు నాయానా! రకరకాల తిట్లు కూడా తినాల్సి వుంటుంది ఒక్కోసారి... ఏం చేస్తాం, పెద్ద మనిషి తనం అంటే మాటలు కాదు'' అని తనని తను సమర్థించుకుంటాడు.

''అయితే ఇప్పుడు వీడ్ని ఏం చేయాలి మామా?'' అడిగాడు సత్యం.

''ఇట్నే నేను చిన్నప్పుడు మా నాయన జేబులోనించి పది పైసల బిళ్ళ తీసారా! అప్పుడు పది పైసలు అంటే మహాఘనంలే! ఇక చూడు నాసామిరంగా, మా నాయన కోలుకొక్కురాయి తీసి, అబ్బో... ఏం కొట్టినా కొట్టేడు. అది సుత ఇక దొంగతనం అంటే ఏమిటో తెలియదు. ఏదైనా ఒకసారి సరసంగా వాయిస్తే ఇక రెండోసారి ఆజోలికి పోడు!''

''నీ కొడుకుల్ని కూడా అట్నే వాయించకపోయా! నీ కొడుకులకి లేని గుణం వుందాంట? తాగడం, చీట్ల పేక ఆడ్డం, లోకుల సొమ్ము తీసుకుని ఎగెయ్యడం! ఒకటా? నీ కొడుకుల్ని కూడా సరసంగా వాయిస్తే రెండో సారి వాటి జోలికి పోరుగా!'' అంది ఆండాళమ్మ.


''అది కాదమ్మాయి...''

''ఇంక అరవ్వాకు పెద్దమడిసని... బొగు తీర్పు చెప్పొచ్చావు! ఇంక రాలేదేందా నారదుడివి, అనుకుంటన్నా! పుండు లేని కాడ పుండు పెట్టేరకానివి! నువ్వు సక్రమంగా పెంచితే నీ కొడుకులకి ఆ బుద్ధులు ఎందుకొస్తయ్? మాకు చెప్పొచ్చావు... ముందు నీ ఇల్లు చక్కదిద్దుకుని అప్పుడు చెప్పు లోకులకి, చెప్పేదేదో!''

''నిజం మాట్టాడితే నిష్ఠూరంలే అమ్మాయ్! ఉన్న మాట ఏదో ముఖాన అనడం నాకు అలవాటు. మీ మొగుడూ పెళ్ళాలూ, కొడుకూ బాగుంటారు, మజ్జిలో నాకెందుకు లేని పోని దురద! నేను ఎందుకు తప్పుడు వాణ్ణి కావాలి? మీరే చేసుకోండి ఏదో! సత్తెం ఏం చేద్దామని నన్ను సలహా అడిగితే చెప్పాను కానీ లేకపోతే నాకు ఎందుకు?'' కోపంగా అన్నాడు సుబ్బన్న.

''దాని మాటలకేంలే, పట్టించుకోవాకు మామా!''

''నేను వెళ్తన్నాలేరా. తోటకూరనాడే తుంచకపోతే, రేపు ఏమిటో మీకే తెలిసిద్ది!





నాకెందుకు, మంచి చెప్పి చెడు ఎందుకు కావాలి?'' అని రుసరుసలాడుతూ సుబ్బన్న వెళ్ళిపోయాడు.

గుంజకి కట్టేసిన నరేష్ కళ్ళంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. చాలా అవమానంగా భావించి దించిన తల ఎత్తలేదు. మనసులోనే గాఢంగా ఏడుస్తున్నాడు.

''ఓరేయ్, డబ్బుకి కటకటగా వుందిరా. చేతిలో రూపాయిలేదు. బాగా డబ్బున్న బ్యాంక్‌ని చూసి మన వాడ్ని ఆ బ్యాంక్ మీదకి వదిలేస్తే బాగుండిద్దనుకుంటారా! ఒక్క రోజులోనే పెద్దవాళ్ళమై పోవచ్చు'' వచ్చిన వాళ్ళలో ఒకతను హాస్యమాడాడు.



ఆండాళ్ళమ్మకి వరుసకి అన్నయ్య అయ్యే సురేంద్ర అపుడే వచ్చాడు.

అతనికి సత్యం పద్ధతులంటే ఒక్కటీ నచ్చదు. ఎప్పుడూ విమర్శిస్తుంటాడు.

సురేంద్ర మంచి వ్యక్తి. అతనంటే చాలా మందికి గౌరవం.

''పసివాడ్ని పట్టుకుని ఏం మాటలూ అని? తెలిసి చేసాడో, తెలియక చేసాడో... తప్పు పని చేసాడు. దానికి నలుగురూ నాలుగు మాటలు అనాలా?'' అన్నాడు కోపంగా, వచ్చీరాగానే.

''ఏదో సరదాకి అన్నాలేవోయ్. సరదాకి అంటే తప్పేముంది?''

''సరదా ఏమిటి? పసివాడ్ని పట్టుకుని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరదానా? మీదేముందిలే, కన్నతండ్రే పదుగురిలో పంచాయితీపెట్టి, ఏదో ఘనకార్యం చేసినట్టు ఉబ్బిపోతుంటే మధ్యలో మిమ్మల్ని ఎందుకు అనాలి? కొద్దిగా అయినా జ్ఞానం వుండాలి, పసివాడ్ని కట్టేస్తారా?'' అని చకచకా నరేష్ కట్లువిప్పి, అక్కడే వున్న అరుగు మీద తను కూర్చుంటూ, వాడిని తన వడిలో కూర్చోబెట్టుకున్నాడు.

''పెద్దవాళ్ళు తాగి తందనాలాడితే తప్పులేదు కానీ, పిల్లవాడు ఏదో పెద్దనేరం చేసాడంట!'' ఆండాళమ్మ అంది కోపంగా.

వచ్చిన వాళ్ళు మెల్లగా ఒక్కొక్కరే వెళ్ళిపోవడం మొదలుపెట్టారు.

''అది కాదోయ్... దొంగతనం చేయాల్సిన ఖర్మ ఏం పట్టిందీ! ఇప్పుడే అదుపులో పెట్టకపోతే పెద్దయిన తరువాత అసలు అలివి అవుతాడా అనీ?''అన్నాడు సత్యం.

''వాడికి ఖర్మ బట్టే దొంగతనం చేసాడు, నీచేత దెబ్బలు తినడానికి! వాడి చేతికి నాలుగు రూపాయలు ఇస్తే దొంగతనం చేసే ఖర్మ పట్టేది కాదుగా!''

''డబ్బులు ఏం చేసుకుంటాడు? ఇంట్లో ఎప్పుడు తినేవి చేయించి పెడుతూనే వుంటా! శనివారం, శనివారం రూపాయి ఇస్తా!''

''నువ్వు కాబోలు ఇస్తున్నావులే రూపాయి. స్కూల్లో పిల్లలకి రకరకాల అవసరాలు వుంటాయి. తోటిపిల్లలు ఏవేవో కొనుక్కుంటారు. వీడికి కొనుక్కోవాలనిపిస్తుంది. వాడికి పదో, పాతికో ఇచ్చి దాచిపెట్టుకుని వాడుకోరా అని చెప్పొచ్చుగా! నీది పెద్ద క్రమశిక్షణ అనుకుంటున్నావుకానీ అది క్రమశిక్షణ కాదు, మొండితనం, జిగినితనం! నీలాంటి పెద్దవాళ్ళు వుంటే పిల్లలు దొంగతనం చేయక ఏం చేస్తారు? వాడు దొంగతనం చేసాడంటే తప్పువాడిది కాదు, నీది!'' సురేంద్ర గట్టిగా మాట్లాడాడు.

''పిల్లవాడి చేతినిండా డబ్బువుంటే ఇక బాగుపడినట్లే! సినిమాలూ, షికార్లూ, చిరుతిళ్లూ పాడు అలవాట్లు అన్నీ ఇప్పటినించే నేర్చుకుంటాడు''

''చేతిలో డబ్బు వుంటే కాదు, లేకపోతేనే చెడు అలవాట్లు నేర్చుకుంటాడు. డబ్బు వుంటే బాధ్యత తెలుస్తుంది. జాగ్రత్త వస్తుంది. డబ్బు విలువ అర్థమవుతుంది. స్కూల్లో తోటి పిల్లలు అందరూ ఏవేవో కొనుక్కుని ఆనందిస్తుంటే, అవి కొనుక్కోలేక వాడికి ఎంత ఆత్మన్యూనత ఏర్పతుంది! కేవలం నీ పద్ధతి కారణంగానే వాడు దొంగతనం చేసాడు'' అన్నాడు సురేంద్ర.

''అలా గడ్డిపెట్టు అన్నా...తన మతమే మతం. తను చెప్పేదే రైటు అంటాడు'' అంది ఆండాళ్ళమ్మ.

''పిల్లవాళ్ళ మనసు గాజులా సున్నితమైంది. ఒకసారి పగిలితే అతుక్కోగలదా? పిల్లలు ఎంత స్వేచ్ఛగా, ఆనందంగా, ఉత్సాహంగా, చలాకీలా పెరగాలి! అంతేకాని దొంగతనాలు చేస్తూ, భయపడుతూ, డబ్బుల కోసం దేబిరిస్తూ సంకుచితంగానా బతికేది''

నరేష్ వంచిన తల ఎత్తలేదు. బాగా వెక్కిళ్ళు పెడుతూ ఏడుస్తున్నాడు. తల్లి వాడ్ని దగ్గరకి తీసుకుని సముదాయించినా ఏడుపు ఆపలేదు.

''ఇంక చాల్లే ఆపు. ఏందో ఏడుస్తున్నాడు! దొంగతనం చేసేటప్పుడు తెలీదూ, తంతారని! గొప్పపని చేసావనా, ఏడుస్తున్నావు! ఎప్పుడూ గుర్తుండేలా, ఇంక నాలుగు తగిలిస్తే రెండోసారి అలాంటి పనులకి పాల్పడరు ఎవరైనా! గారాబాలు చేస్తే అసలు బాగుపడతారా'' అన్నాడు సత్యం కోపంగా.

''నువ్వు మారవు. నీ ధోరణి నీదే!'' అన్నాడు సురేంద్ర నిరసనగా ఆ తండ్రి వైపు చూస్తూ.

నరేష్‌ని తీసుకుని ఆండాళ్ళమ్మ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

వారం రోజులు గడిచిపోయాయి.

నరేష్ ఇంట్లో బీరువాలో దాచిన పదివేల రూపాయల డబ్బు తీసుకుని, ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

*

## పార్వతి 'వరుడు' మహేషుడు!

పార్వతీ మెల్టన్ 'వెన్నెల' చిత్రంతో మంచి హిట్‌నే సంపాదించినప్పటికీ తర్వాత్తర్వాత అన్నీ రెండో హీరోయిన్ పాత్రలే వచ్చాయి. అవి కూడా అన్నీ బడుగు నిర్మాణ సంస్థల నుండే! కిమ్మనక వచ్చిన అవకాశాలన్నీ చేసుకుంటూ పోయింది. అయితే ఇప్పుడు 'జల్సా'లో రెండో హీరోయిన్ పాత్రతో అదృష్టం ఆమె తలుపు తట్టింది. 'జల్సా' సినిమాకు తన గొంతు అరువిచ్చిన మహేష్ బాబు ఆమెను చూసి ముగ్ధుడైపోయాడట. ప్రస్తుతం మహేష్ 'వరుడు' అనే చిత్రంలో నటిస్తున్నాడు. దీనికి హీరోయిన్ కోసం చాలా మందిని పరిశీలించారు. చాక్లెట్ బాయ్ ప్రక్కన నప్పే హీరోయిన్ ఎవరా అని దీపికా పదుకొనే నుండి ఇలియానా వరకూ అందర్నీ ఆలోచించారు. ఇప్పుడు మహేష్ బాబు చలవతో ఈ సినిమాలో పార్వతీ మెల్టన్ అవకాశం దక్కించుకుంది. ఇద్దరికీ ఫోటో షూట్ జరిపి మహేష్ ప్రక్కన ఆమె అయితేనే బాగుంటుందని తీర్మానించారు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఇంత పెద్ద హీరో చిత్రంలో సోలో హీరోయిన్ పాత్ర చేయడం పార్వతీ మెల్టన్‌కు ఇదే మొదటి సారి. 'జల్సా'లో పవన్ కళ్యాణ్ ప్రక్కన నటించినా ఆమెది రెండు మూడు సీన్లు మాత్రమే ఉండే పాత్ర. ఇప్పుడీ అవకాశమైనా ఆమెను తారాపథంలో నిలుపుతుందని ఆశిద్దాం.